క్లుప్తంగా

సింహ వాహనంపై దర్శనమిచ్చిన పాండురంగడు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, గణపతి పూజ, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి పాండురంగడు సింహవాహనంపై దర్శన మివ్వడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం స్వామివారు శేషవాహనంపై దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.


ఘనంగా నరసింహస్వామి జయంతి



నందవరంలో నరసింహస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్ :నరసింహస్వామి జయంతి వేడుకలు మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. నందవరం గ్రామంలో వెలసిన నరసింహస్వామి ఆలయంలో మద్దిలేటిస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం అభిషేకం, ఆకుపూజ, దీపోత్సవం తదితర పూజలు నిర్వహించారు. అలాగే బనగానపల్లె పట్టణంలోని రవ్వకొండపై వెలసిన నరసింహస్వామి ఆలయం లో భక్తులు పూజలు చేశారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



పుట్టపెద్దమ్మ

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు వైశాఖ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చారు. అదే విధంగా పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీదేవి, సిమెంట్ నగర్ గ్రామ సమీపాన వెలసిన సుంకులా పమేశ్వరీకి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వాహనాల తనిఖీ



కోట్లవారిపల్లె సర్కిల్‌లో వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

డోన్ టౌన్ : అక్రమంగా ప్రయాణికులను తరలించే వాహనాలను మంగళవారం ఆర్టీసీ డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తనిఖీ చేశారు. పట్టణ సమీపంలోని కోట్లవారిపల్లె సర్కిల్‌లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బేతంచెర్ల, రాయలచెరువు, జలదుర్గం తదితర రూట్లలో వచ్చే పోయ్యే వాహనాలను తనిఖీ చేశారు. సరియైన పత్రాలులేని, కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలించే వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. 15 వాహనాలను సీజ్ చేసి రూ.48,700 అపరాధ రుసుం వేసినట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేశపోగు ప్రసాద్(53) మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి గ్రామానికి చేరుకొని దేశపోగు ప్రసాద్ మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు ఎద్దులన్న, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వడదెబ్బ ముప్పు

- పశుపోషకులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- మూగజీవుల శరీర మార్పులు గమనిస్తూ ఉండాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణనష్టం



పశువులకు వైద్య సౌకర్యం కల్పిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

బనగానపల్లె: వేసవిలో పశువులకు వడదెబ్బ ముప్పు ఎక్కువగా ఉంటుంది. పశుపోషకులు అప్రమత్తంగా వ్యవహరించకుంటే ప్రాణ నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదు. వేసవిలో పశుపోషకులు అప్రమత్తంగా వ్యవహరించాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. మూగజీవుల శరీర మార్పులను గమనిస్తూ ఉండాలి. ఏ మాత్రం తేడా ఉన్నా వెంటనే వైద్య చేయించాలి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాడినే నమ్ముకొని జీవించే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పశువులు వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవచ్చు. వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేధ గ్రంధుల నిర్వాహణపై పర్యవేక్షణ కొల్పోతాయి. చమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె నాడి వేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సరిగా పని చేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లి శ్వాస అడక మరణించే ప్రమాదం ఉంది.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బతగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. నీడ కోసం చెట్టుకింద చేరి కూలబడుతాయి. శ్వాసపీల్చడం కష్టమవుతుంది. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. దూడల్లోనూ వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలకు అతిసార వ్యాధి సోకే అవకాశం ఉంది.

నివారణ చర్యలు

వేసవిలో ఎండలకి పశువులను వదలకూడదు. ఉదయం సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పశువులను బయట వదలాలి. పశువులను రోజుకు మూడు, నాలుగుసార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకర జాతి అవులు, గేదేలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. తరచుగా చల్లని నీటిని చల్లుతూ ఉండాలి. గాలి బాగావీచే ఎత్తుగా ఉండేలా పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకుల కప్పులు ఉన్న షెడ్లు ఉంటే గడ్డితో కప్పాలి. మధ్యాహ్నం నీరు చల్లుతూ ఉండాలి. వడగాల్పుల ప్రభావం పడకుండా గోనే సంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.

పశువును చల్లని నీటితో కడగాలి



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోడానికి పలు మార్లు చల్లనీ నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వేడిని తగ్గించే ఇన్‌జక్షన్ వేయించాలి. రక్తంలో అవసరమైన సైలైన్ ఎక్కిస్తే శరీరానికి సరిపడ గ్లూకోజ్ ఎలక్ట్రోలైట్స్ అందడంతో పశువులు నీరసం నుంచి బయటపడుతాయి.

– మారుతిసకారామ్, ఏడీఏ బనగానపల్లె.

నియోజకవర్గంలో పశు సంపద వివరాలు

మండలం	ఎద్దులు,ఆవులు	బర్రెలు	గొర్రెలు	మేకలు
బనగానపల్లె	4,631	26,906	51,540	17,638
అవుకు	5,171	14,334	55,653	29,352
కొలిమిగుండ్ల	1,267	10,471	56,999	27,219
సంజామల	1,909	12,410	30,792	8,835
కోవెలకుంట్ల	896	8,439	9,861	3,451

నేటి నుంచి హోమాలు

నంద్యాల(అర్బన్): మండలంలోని మిట్నాలలో వెలసిన అవధూత శివరామస్వామి ఆలయంలో బుధవా రం నుంచి రెండు రోజుల పాటు శ్రీపాద శ్రీవల్లభ జాతక గురుబల సిద్ధి వ్రతం, శ్రీదత్తాత్రేయస్వామి హోమాలు నిర్వహిస్తున్నట్లు శివరామస్వామి భక్త మండలి సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం గోపూజ, శ్రీలక్ష్మీ గణపతి సహిత రుద్రహోమాలు ఉంటాయని, సాయంత్రం గ్రామ దేవతలకు నూతన పట్టువస్త్రాల సమర్పణ, ఆధ్యాత్మి క ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. గురువారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం గోపూజ, దత్త హోమాలు, అన్నప్రసాద వితరణ చేపడతామని, సాయంత్రం దత్తాత్రేయ స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని వివరించారు.

నేటి నుంచి గోకారమయ్య ఉరుసు

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామంలో వెలసిన హజరత్ గోకారమయ్య స్వామి ఉరుసు బుధవారం నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 22న గంధోత్సవంతో పాటు ఖవ్వాళి, 23న ఉరుసు, 24న స్వామి జెండా ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల: రోహిణి కార్తీలోనే పెనుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. త్వరలోనే నైరుతి రుతుపవనాల రాకతో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గాలి,వాన సమయంలో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ట్రాన్స్‌కో అధికారులు, వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. పొలాల్లో వ్యయసాయ పనులకు వెళ్లిన సమయంలో అకస్మాత్తుగా వర్షం కురిసిన సమయంలో రైతులు,కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, ఎటువంటి పరిస్థితుల్లో చెట్ల కిందకు వెళ్లరాదన్నారు. పెనుగాలులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని సూచించారు. రాక పోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు చాలా మంది వర్షం కురిస్తే చెట్ల కిందకు వెళ్తుంటారని, అలా చేయడం చాలా ప్రమాదకరమన్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

చిన్న పాటి వర్షం కురవడం ప్రారంభం కాగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్ల కింద, ఎత్తైన ప్రదేశాల కింద ఉండకూడదు. ఇంట్లో ఉన్న కరెంట్ స్విచ్ బోర్డులు నుంచి ప్లగ్‌లు తీసివేయాలి. టీవీలు, సెల్‌ఫోన్‌లు చూడొద్దు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉండరాదు.

ఉపాధి పనులకు వెళ్లినా హాజరు వేయడం లేదు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కూలీలు

కొలిమిగుండ్ల: ఉపాధి పనులకు వెళ్తున్నా ఫీల్డ్‌అసిస్టెంట్ హాజరు సరిగ్గా వేయడం లేదని బెలుం గ్రామానికి చెందిన కూలీలు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కొలిమిగుండ్ల ఎంపీడీఓ కార్యాలయం నిరసన తెలిపారు. వేతనం కూడా తక్కువ మొత్తంలో వస్తుందని ఈ సందర్భంగా కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని, మష్టర్లలో హాజరు సరిగా వేయడం లేదని ఆరోపించారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎన్ఆర్‌ఈజీఎస్ అధికారులు ఉపాధి కూలీలకు హామీ ఇచ్చారు.

ఫీజు చెల్లించకపోయినాపరీక్ష రాసే అవకాశం

కోవెలకుంట్ల: పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు అనివార్య కారణాలతో ఫీజు చెల్లించకపోయినా ఈ ఏడాది సప్లమెంటరీ పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నట్లు ఎంఈఓలు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరం మార్చి నెలలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షలకు వివిధ కారణాలతో హాజరు కాని విద్యార్థులు, ఆయా సబ్జెక్టుల్లో తప్పిన పోయిన విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ నుంచి సప్లమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు ఫీజు చెల్లించకపోయినా విద్యార్థులకు ప్రభుత్వం పరీక్షలు రాసే అవకాశం కల్పించిందన్నారు. సంబంధిత అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

బనగానపల్లె రూరల్: ఈ నెల 24వ తేది నుంచి ప్రారంభమయ్యే పది సప్లిమెంటరీ పరీక్షకు ఫీజు చెల్లించక పోయిన విద్యార్థులకు సైతం హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ స్వరూప మంగళవారం తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదవ తరగతి పాఠ్యాపుస్తకాల సిలబస్ మారుతున్నందున ఫీజు చెల్లించని విద్యార్థులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

డోన్ టౌన్ : ఈ నెల 24నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజు చెల్లించకున్నా రాయొచ్చని మండల విద్యాధికారి ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం గత రెండు సంవత్సరాల క్రితం ఫెయిల్ అయిన వారికి కూడా వర్తిస్తుందని, అయితే వారు మార్చి 2024లో పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉండాలన్నారు. పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్లో ఏ,బీ కేంద్రాల్లో సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మందు బాబుల నిలయంగా ఆర్టీసీ బస్టాండ్!

కొలిమిగుండ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ మందు బాబులకు నిలయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చీకటి పడితే చాలు బస్టాండ్ ఆవరణలో చెట్టు కింద మందు బాబులు తిష్టవేస్తున్నారు. రాత్రి పది గంటల వరకు అక్కడే మద్యం సేవిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వాటర్ ప్యాకెట్లు, కూల్‌డ్రింక్స్, మద్యం ఖాళీ బాటిళ్లు, నాటుసారా ప్యాకెట్లు పడేస్తున్నారు. ఇటీవల రామ్‌కో సిమెంట్ కంపెనీ సహకారంతో ఆర్టీసీ బస్టాండ్‌ను అందంగా తీర్చిదిద్దారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో కూల్ డ్రింక్స్ షాపులు ఏర్పాటు కావడంతో మందు బాబులు వాటర్ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ తీసుకొని మద్యం సేవిస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. బస్టాండ్ లోపల ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలపై ఎప్పుడు చూసిన స్థానికులు గంటల తరబడి కూర్చోని పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటు ఉంటున్నారు. మహిళలు, వృద్దులు బస్టాండ్‌లోకి కూర్చునేందుకు వచ్చినా లేవకుండా అలాగే ఉంటున్నారు. దీంతో మహిళలు చేసేది లేక దుకాణాల వద్ద ఉండాల్సి వస్తుంది. బస్టాండ్ ప్లాట్‌ఫారంలో కార్లు, ఆటోలు, బైక్‌లు అడ్డగోలుగా పార్కింగ్ చేస్తుండటంతో ఆర్టీసీ బస్సులో లోపలికి వచ్చేందుకు ఇబ్బందిగా మారుతుంది. ఆర్టీసీ కంట్రోలర్ లేక పోవడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పోలీసులు, ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బలపాలపల్లెలో పోలీస్ సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ



రామాపురం గ్రామస్తులతో సమావేశమైన పోలీసులు

పెట్నికోటలో కార్డన్ సెర్చ్

కొలిమిగుండ్ల: నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మంగళవారం ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్‌రెడ్డి, సంజామల, కోవెలకుంట్ల ఎస్ఐలు రమేష్‌రెడ్డి, మల్లికార్జున సిబ్బందితో కలిసి తెల్లవారు జామునే పెట్నికోటలో పలువురు ఇళ్లలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. కొలిమిగుండ్లలో ప్రధాన రహదారి, పలు వీధుల్లో కవాతు నిర్వహించారు. జూన్4న ఎన్నికల కౌంటింగ్ ఉండటంతో గ్రామాల్లో ఎక్కడా అల్లర్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ చెప్పారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

బేతంచెర్ల: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రియతం రెడ్డి హెచ్చరించారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం మండల పరిధిలోని బలపాలపల్లెలో సీఐ ప్రియతంరెడ్డి, పోలీస్ సిబ్బందితో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చా రు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత గ్రామా ల్లో ఊరేగింపులు, ర్యాలీలను నిషేధించామన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

సంజామల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ రమేష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఎస్ఐ మాట్లడుతూ జూన్ 4న ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో అభ్యంతకరమైన పోస్టులు, ఆధారాలు లేకుండా కథనాలు రాసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ముగ్గురు మించి ఉండరాదని సూచించారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు

అవుకు: అంసాఘిక కార్యకలాపాలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని బనగానపల్లె సీఐలు తిమ్మారెడ్డి, గంట సుబ్బారావు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని రామపురంలో పోలీసులతో కలసి వారు కార్డెన్ సర్చ్ నిర్వహించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

బనగానపల్లె రూరల్ : జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని ట్రైనీ డీఎస్పీ రఘువీర్ సూచించారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంట సీఐలు గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డితో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల పై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎన్నికల్లో గెలిచినవారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బాణా సంచాలు పేల్చేడానికి పోలీసులు అనుమతి లేదన్నారు. ఎవరైన శాంతిభద్రతకుల విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామిరెడ్డి, తిరుపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అనుమానాస్పద ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమైన వారు ప్రతిఒక్కరూ పోలీసుల నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అవుకు, బనగానపల్లె, నందివర్గం ఎస్ఐలు కిరణ్, రామిరెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



కొలిమిగుండ్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



బనగానపల్లె పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నందవరం పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని నందవరంలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాల సమయంలో పశువుల్లో గొంతువాపు వ్యాధి, జబ్బా వాపు వ్యాధి, జీవాలకు చిటిక వ్యాధి ప్రబలే అకాశం ఉన్నందన్నారు. ముందస్తుగా ఈ వ్యాధుల నివారణకు గ్రామాల వారీగా పశువులకు టీకాలు వేస్తున్నామని, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కమనీయం చెన్నకేశవుడి కల్యాణం





స్వామివారిని దర్శించుకుంటున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు,శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

అవుకు: మండల కేంద్రం అవుకులోని చెన్నకేశవ ఆలయంలో శ్రీవారి కల్యాణం మంగళవారం కనుల పండువగా జరిగింది. అంతకుముందు వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, నాయకులు పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రైతు సంఘం పెద్దలతో కలసి తలంబ్రాల బియ్యం, వస్త్రాలు, మాంగల్యం సమర్పించారు. అర్చకులు, వేద పండితులు చెన్నకేశవ స్వామి, శ్రీదేవి,భూదేవి అమ్మవార్లను సుందరంగా అంకరించారు. శ్రీవారి కల్యాణమహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరోగింపుగా తీసుకెళ్లారు.

ఈత...ఉపశమనం



యు కొత్తపల్లె వద్ద స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న యువకులు





వెంకటాపురం సమీపాన దిగుడుబావిలోకి దుంకుతున్న చిన్నారి,ఈత కొడుతున్న చిన్నారులు

డోన్ : ఈ వేసవిలో ఎండలు దంచికొడుతుండటంతో చిన్నారులు, యువత ఎండవేడిమి నుండి ఉపశమనం పొందేందుకు బావులు, ఈతకొలనులను ఆశ్రయిస్తున్నారు. వేసవి సెలవులు రావడం కూడా యువతలో ఈత నేర్చుకోవాలనే సరదా పెరిగింది. పట్టణ శివారులోని పంట పొలాల్లో అధిక సంఖ్యలో ఉన్న దిగుడు బావుల స్థానంలో బోరు బావులు వెలసిన నేపథ్యంలో యువత స్విమ్మింగ్ పూల్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు. పట్టణంలోని ఉంగరానిగుండ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాలిక్ బాబా వెళ్లే రహదారిలో, ఎన్‌హెచ్ 44 పక్కన గల స్విమ్మింగ్ పూల్‌లపాటు ఇటీవల రూ.కోటి వ్యయంతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ డాక్టర్ రామసుబ్బయ్య పార్కులో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ యువకులు, చిన్నారులతో కిటకిటలాడుతున్నాయి. స్విమ్మింగ్ పూల్‌ల సంఖ్య పెరగడంతో చాలా మంది ఈత కొట్టేందుకు మొగ్గుచూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో మాత్రం యువత దిగుడుబావుల్లోనే ఈత కొడుతూ సేదతీరుతున్నారు. బావులు, ఈత కొలనులు యువతతో సందడిగా కనిపిస్తున్నాయి.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డోన్ మున్సిపల్ కమిషనర్ జయరామ్

డోన్ టౌన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ ప్రజలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని కేవీఆర్ నగర్ సచివాలయం పరిధిలోని కురుకుందు కాలనీ, అయ్యప్ప స్వామి గుడి తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆయన మాట్లాడుతూ అంటు వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం కాలనీల్లో జరుగుతున్న పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు.

నేడు మద్దిలేటయ్య క్షేత్రంలో పూజలు



మద్దిలేటి నరసింహ స్వామి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రమైన వైశాఖ శుద్ధ చతుర్దశిస్వాతి నక్షత్రం వేడుకలునిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, నవ కళశారాధన, అగ్ని ప్రతిష్ఠ, ఆదివాస లక్ష్మీ నరసింహ హోమం, అభిషేకం తదితర పూజలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొనేవారు ఆర్జిత సేవ ఉభయ దాతలు పాల్గొనవచ్చును. సదూర ప్రాంతం నుంచి రాలేని భక్తుల కోసం దేవస్థానం పరోక్ష సేవ ఏర్పాటు చేసిందన్నారు. ఈసేవలో ఉభయ దాతలు వారి గోత్రములు నమోదు చేసుకుంటే వారిపేరిట స్వాతి నక్షత్రం (నరసింహ జయంతి) వేడుకలు నిర్వహిస్తామన్నారు.